



వైభవంగా సంతమల్లన్న ఉత్సవాలు

- ఐదు రకాల ధాన్యాలతో నైవేద్యం తయారు
- బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు



• మల్లన్న స్వామికి కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు

వేల్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ సంతమల్లన్న జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం వేలాది మంది భక్తులు తరలివచ్చి సంత మల్లన్న దేవుడికి నైవేద్యాలు సమర్పించారు. అంక్సాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి సంతమల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రకాల ధాన్యాలతో తయారు చేసిన వంటకాలతో నైవేద్యం తయారు చేసి సంతమల్లన్నకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్మూర్ డివిజన్ మండలాల గ్రామాల నుంచే కాకుండా కరీంనగర్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి వాహనాలపై వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివచ్చి బోనాలు తయారు చేశారు. ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చేపట్టారు.



కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మంగళవారం తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నూతనంగా నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వాహక అభియంత కె.సర్దార్ సింగ్ ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన నమూనాను అనుసరిస్తూ జిల్లాలో కూడా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీవో సాయగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మూడో విడతలో 19 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

- 490 వార్డు స్థానాలు
- జిల్లాలో 86 సర్పంచ్ స్థానాలు యునానిమస్

నిజామాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో 19 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇప్పటికే మొదటి విడతలో 29 సర్పంచ్, 575 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడతలో 38 సర్పంచ్, 674 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మూడో విడత ఎన్నికలు జరుగనున్న 165 సర్పంచ్, 1620 వార్డు స్థానాలకు గాను 19 సర్పంచ్ స్థానాలు, వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 3వ విడత ఎన్నికలు జరుగుతున్న 11 మండలాలలో ఆలూరు మండలం మిర్జాపల్లి, రామస్వామి క్యాంప్, దేగాం సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా డొంకేశ్వర్ మండలంలో సిర్పూర్, భీంగల్ మండలంలో రాహత్‌న గర్, కారేపల్లి తండా, సంతోష్‌నగర్ తండా, సుదర్శన్‌నగర్ తండా, మోర్తాడ్ మండలం డొంకల్, కమ్మర్‌పల్లి మండలం డిసితండా, ఏర్గట్ల మండలం గుమ్మి ర్యాల్, దొంచంద, నాగేంద్ర నగర్, వేల్పూర్ మండలం జాన్కంపేట్, కొత్తపల్లి, అంక్సాపూర్, హనుమాన్‌నగర్ సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీ

- వారి మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

8



రాగిజావ నిధులు హాంఫట్!

ప్రతి నెలా రూ.57 లక్షలపైనే బిల్లులు

- జిల్లాలో అంతంతమాత్రంగానే అమలు
- పట్టించుకోని ఎంఈవోలు, హెచ్‌ఎంలు
- పోషకాహారానికి దూరమవుతున్న చిన్నారులు
- జిల్లాలో 1159 ప్రభుత్వ పాఠశాలలు
- 90వేల మందికి పైగా విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రారంభించిన రాగిజావ కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. సంబంధిత బెంగళూరుకు చెందిన శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌కు మాత్రం ప్రతి నెలా రూ.57 లక్షల పైన బిల్లులు జిల్లా విద్యాశాఖ నుంచి మంజూరవుతున్నాయి. రెండేళ్లకు సంబంధించి సుమారు రూ.10 కోట్లపైనే బిల్లులు మంజూరయ్యాయంటే కార్యక్రమం అమలుతీరు అర్థమవుతోంది. పీఎం పోషణ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకాక చిన్నారులు పోషకాహారానికి దూరమవుతున్నారు.

నిజామాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారంలో మూడు రోజులు గుడ్డు, మరో మూడు రోజులు ఉదయం రాగిజావ అందించాలని 2023లో అప్పటి ప్రభుత్వం శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి. 2025 ఏప్రిల్ విద్యాసంవత్సరం ముగిసే వరకు నిర్వహించింది. కానీ ఈ విద్యాసంవత్సరం జూన్‌లో ప్రారంభమైనా ప్రభుత్వం నుంచి రాగిజావ ప్రారంభంపై స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో మధ్యలో మూడు నెలల పాటు ఈ కార్యక్రమం నిలిచిపోయింది. సెప్టెంబరు 1న తిరిగి రాగిజావా కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఉత్తర్వులు ఇచ్చినా అక్టోబరు నుంచి మండల విద్యాశాఖ కార్యాలయాలకు రాగిజావ, బెల్లం పౌడర్‌ను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 1159 ప్రభుత్వ పాఠశాలల్లో 90వేలకు పైగా విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని అందించాలనే లక్ష్యం ఉండగా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా కూడా రాగిజావను అమలు చేయడంలేదు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఎలాంటి కమీషన్ ఇవ్వకపోవడంతో వారు అంతంతమాత్రంగానే విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నారు. మండల విద్యాశాఖ కార్యాలయాలకు రాగిజావ మెటీరియల్ వస్తున్నా పాఠశాలలకు తీసుకెళ్లేందుకు ఎలాంటి రవాణా చార్జీలు ఇవ్వకపోవడంతో ప్రధానోపాధ్యాయులు విముఖత చూపుతున్నారు.

మండల కార్యాలయాల్లోనే రాగిజావ..

జిల్లాలో చాలాచోట్ల రాగిజావ మెటీరియల్ మండల కార్యాలయాల్లోనే పడిఉంటుంది. ప్రతి నెలా రాగిజావకు సంబంధించి జిల్లా నుంచి రూ.57లక్షల పైనే బిల్లులు బెంగళూరుకు చెందిన శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌కు మంజూరవుతోంది. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

శాంతియుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలి

- పోలీసు కమిషనర్ సాయి చైతన్య

బోధన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించే విధంగా ఏర్పాట్లు చేయాలని సీపీ సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత ఎన్నికలు బోధన్ డివిజన్ పరిధిలో జరగనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పోలీసు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బోధన్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్ గుర్తించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం రవాణా జరగడానికి వీలు లేకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణ, నిజామాబాద్ నార్త్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రుద్రూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి, ఎడపల్లి ఎస్సై రమ, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, కోటగిరి ఎస్సై సునీల్, వర్ని ఎస్సై ఎస్.రాజు, రుద్రూర్ ఎస్సై సాయన్న పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, నాయకులు

కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ ఏర్పాటు

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. డిసెంబరు 9 విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బస్టాండ్ ప్రాంతంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యమ సారథి కేసీఆర్ నిరంతర దీక్ష ఫలితంగా డిసెంబరు 9 తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన రోజు అన్నారు. కేసీఆర్ పాలనలో జీఎస్డీపీలో 4వ స్థానంలో ఉన్న తెలంగాణ ప్రస్తుతం 12వ స్థానానికి దిగజారి పోయిందన్నారు. జీఎస్టీ వసూళ్లలో 1వ స్థానం నుంచి 28వ స్థానం, తలసరి ఆదాయంలో 1వ స్థానంలో నుంచి 4వ స్థానంకు పడిపోయిందన్నారు. కానీ రైజింగ్ తెలంగాణ అని పోకడకు పోతున్నారన్నారు. మక్కలు కేవలం 25 శాతం మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకొని రెండు నెలలు గడిచిన వారికి డబ్బులు ఇవ్వలేదు అన్నారు. ఈ కార్య క్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, నాయకులు చౌట్‌పల్లి రవి, ఆర్మూర్ మహేష్, ఓమాయి రాజేశ్వర్, బొదిరే నర్సయ్య, గొల్లపల్లి సురేష్, విక్రమ్‌అలీ, రామ్‌చరణ్, హరీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుమంత్ ధనుష్

అగ్నివీరులు..!

- ఎయిర్‌మెన్లుగా నందిపేట కుర్రాళ్లు
- సాధారణ కుటుంబాల నుంచి దేశ సేవకు

నందిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో ఉద్యోగం వారి కల.. చిన్ననాటి నుంచే జవానుగా దేశానికి సేవ చేయాలనేదే వారి సంకల్పం. ఎట్టకేలకు చిన్న కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ కలను సాకారం చేసుకున్నారు. వారే నందిపేటకు చెందిన సుమంత్, పాతూరుకు చెందిన ధనుష్. మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన సుమంత్ అగ్నివీర్‌లో ఎయిర్‌మాన్(వై) విభాగంలో ఉద్యోగం సాధించాడు. డిసెంబర్ 8న విడుదల చేసిన ఫలితాలలో ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్‌లో ఎయిర్‌మాన్‌గా ఎంపిక అయ్యాడు. 5 నెలల వయస్సులోనే తల్లి రాజ్యలక్ష్మిని కోల్పోయిన సుమంత్ తన తండ్రి నాగేష్ సంరక్షణలో పెరిగాడు. విద్యాభ్యాసం అంతా జిల్లాలోనే కొనసాగించాడు. 2023లో ఎయిర్‌ఫోర్స్ ఎగ్జామ్‌లో విఫలమైనప్పటికీ 2024లో ఇండియన్ ఆర్మీ రాత పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఫిజికల్ టెస్ట్‌లో ఫెయిలయ్యాడు. 2025లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఫలితాల్లో మంచి ర్యాంక్‌ను సాధించి ఎయిర్‌మాన్‌గా ఎంపికయ్యాడు. ఎటువంటి శిక్షణ

మిగతా 8వ పేజీలో...



నవీన్ రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఓట్.. నాట్ ఫర్ సేల్..

- ఇంట్లో ఓట్లు అమ్మబడవని ఫ్లెక్సీ

మోస్రా, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవూర్ గ్రామంలో దుంద్ర నవీన్‌రెడ్డి అనే యువకుడు 'మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు' అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. ఓటు ఎంతో విలువైనదని దానికి వెల కడితే భవిష్యత్తుకు అర్థం ఉండదని తెలపడానికి ఫ్లెక్సీని ఇంటి ఎదుట ప్రదర్శించినట్లు తెలిపాడు. విందు, వినోదాలు, డబ్బులు, మద్యానికి ఓటర్లు అమ్ముడుపోవద్దని సందేశం ఇచ్చాడు.



మొదటి విడత ప్రచారానికి తెర

- గెలుపు వ్యూహాల్లో అభ్యర్థులు
- రేపు మొదటి విడత ఎన్నికల పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నిజామాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత ప్రచార అంకానికి తెరపడింది. దీంతో అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. తమకు అనుకూలంగా ఉన్న కుల సంఘాలు, గ్రామ పెద్దలను, మహిళ సంఘాలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గెలుపుకోసం అవకాశం ఉన్న ఏ చిన్న అవకాశాన్ని సైతం అభ్యర్థులు వదలడంలేదు. పార్టీ గుర్తు లేకున్నా ప్రధాన పార్టీల తరఫున అభ్యర్థులు బరిలో దిగి గత వారం రోజులుగా తమ ప్రచారాన్ని నిర్వహించారు. కొన్నిచోట్ల సొంత పార్టీకి చెందిన వారే పోటీలో ఉండడంతో వారిని తట్టుకుని మెజార్టీ ఓట్లు సాధించేందుకు అభ్యర్థులు నానాతంటాలు పడుతున్నారు. ఖర్చు ఎంతైనా పరువుకాపాడుకునేందుకు అభ్యర్థులు తాపత్రాయ పడుతున్నారు. కుల సంఘాల నాయకులను, గ్రామ పెద్దలను కలుస్తూ గంపగుత్తగా ఓట్లను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విందులు, వినోదాలతో పాటు మహిళలకు కూల్‌డ్రింక్స్, మటన్, చికెన్‌లు పంచుతూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు కేటాయించిన గుర్తులను పంచుతూ ఎలాగైనా సరే ఎన్నికల్లో గెలిచే ప్రయత్నాలు చేస్తున్నారు.

మొదటి విడత పోలింగ్‌కు ఏర్పాట్లు

మొదటి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. జిల్లాలో మొదటి విడతలో 184 సర్పంచ్, 1642 వార్డు స్థానాల కోసం షెడ్యూల్ విడుదలకాగా ఇప్పటికే మొదటి విడతలో 29 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 580 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 5 వార్డులకు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. దీంతో అధికారులు 155 సర్పంచ్ స్థానాలకు, 1062 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పోలింగ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించనున్నారు. 155 సర్పంచ్ స్థానాలకు 519 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 1062 వార్డు స్థానాలకు 2734 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు సైతం గ్రామాల్లోకి రావడంతో గ్రామాల్లో ఓట్ల సందడి నెలకొంది.



పరిశీలిస్తున్న అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మొదటి దశలో ఎన్నికలు జరిగే మండలాల పోలింగ్ సిబ్బంది తుది ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, జనరల్ అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్ సమక్షంలో మంగలవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్ నిశితంగా పరిశీలించారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.

క్రైం సమాచారం

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య


గణేష్

బాన్సువాడ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాంపూర్ తండాకు చెందిన బానోత్ చందర్ కుమారుడు గణేష్(24) ఉపాధి కోసం హైదరాబాద్‌లో రాపిడో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమ వారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లోని చైతన్యపురి కాలనీలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలిసిన పోలీసులు కేసు నమోదు చేసు కుని విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి మృతుడి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తల్లిదండ్రులు దానం చేశారు. కుమారుడు చనిపోయిన అతడి నేత్రాలను దానం చేసినందుకు మృతుడి తల్లిదండ్రులను పలువురు అభినందించారు. యువకుడి అకాల మృతితో రాంపూర్ తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి


లలిత

కోటగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లలిత ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. వారం క్రితం అనారోగ్యానికి గురైన లలిత చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతి పట్ల తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసం

రుద్రూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోధన్ డిపోనకు చెందిన టీఎస్ 16 యూసీ 3223 ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు వెనుక భాగాన ఉన్న అద్దాన్ని మండల కేంద్రంలోని జేఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి రాయితో పగలగొట్టాడని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ తెలిపారు. బాన్సువాడ నుంచి బోధన్ వైపు వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెగులు బస్సు అక్బర్‌నగర్ వద్ద చిన్నపాటి జరిగిన గొడవ కారణంగా రుద్రూర్ గ్రామంలోని జేఎస్సీ కాలనీ వద్ద కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు వెనుక భాగాన అద్దాన్ని రాయితో ధ్వంసం చేశాడన్నారు. దీంతో వెనుక సీటులో కూర్చున్న వ్యక్తికి తీవ్ర గాయం అయిందని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ వివరించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకొని, వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు.

గడ్డపార దొంగల గ్యాంగ్ అరెస్టు

- ఐదుగురు నిందితుల రిమాండ్
- భారీగా బంగారం, వెండి నగలు స్వాధీనం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న గడ్డపార గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో రాత్రుల సమయంలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగల ముఠా గడ్డపారలతో ఇళ్ల తలుపులను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 2న ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారతో ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలోని బంగారం, వెండి నగలు దొంగిలించారని తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన మసుల శ్రీనివాస్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని తెలిపారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించామన్నారు. మంగళవారం తాడ్వాయి ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా.. గడ్డపార గ్యాంగ్‌లోని ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ గ్యాంగ్ నాలుగు నెలలుగా తాడ్వాయి, గాంధారి, లింగంపేట్, రాజంపేట్, బాన్సువాడ పరిధిలో కలిపి మొత్తం తొమ్మిది ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేసినట్లు విచారణలో తెలిసిందన్నారు. ఈ గ్యాంగ్ ప్రధానంగా పగలు, రాత్రి సమయాల్లో లాక్ చేసిన ఇళ్లను గుర్తించి గడ్డపార, ఇనుప రాడ్లతో తలుపుల తాళాలు, బెడ్‌రూమ్, అల్మారీ తాళాలు పగలగొట్టి బంగారం, వెండి నగలు నగదు దొంగతనం చేసేవారని వివరించారు. నిందితులు దొంగిలించిన నగలను కొంతమంది అక్రమ గోల్డ్ కొనుగోలుదారులకు విక్రయించినట్లు కూడా అంగీకరించారన్నారు. అరెస్ట్ అయిన వారిలో మండలానికి చెందిన బస్సి జోధ్‌రాజ్, అంకుష్ ప్రేమ్‌సింగ్ సాబలే, బామన్ మహేందర్, నూనవత్ గణేష్ ఉన్నారన్నారు. వారి నుంచి 11 తులాల బంగారం, 22 తులాల వెండి, ఒక బైక్, 5 మొబైల్ ఫోన్లు, రూ.8500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దర్యాప్తులో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి నిందితులను పట్టుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, తాడ్వాయి ఎస్‌ఐ నరేష్, గాంధారి ఎస్‌ఐ అంజనేయులు, కానిస్టేబుల్ సాయిబాబా, రవి, సంజీవ్, హోంగార్డ్ వసంత్ లను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు

ఇళ్లలో చోరీ.. నలుగురికి రిమాండ్

నిజామాబాద్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఇళ్లలో చోరీలకు పాల్పడే నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 8న సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఖానాపూర్ చౌరస్తా వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని రూరల్ పోలీసులు పట్టుకుని విచారించగా.. నిర్మల్ జిల్లా బైంసాకు చెందిన అహ్మద్ హుస్సేన్ (26), అబూబాకర్, నాంపల్లి వెంకటచారి, నాంపల్లి సాయిచరణ్‌లుగా నిర్ధారించారు. వీరు గతంలో నిజామాబాద్ నగరంలోని 1, 3, 4 పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలోని ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. వీరి నుంచి రూ.70 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, 7 వాచ్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా వీరికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. నగరవాసులు ఎవరైనా ఇంటినుంచి బయటకు వెళ్లినప్పుడు ఇంట్లో విలువైన బంగారు, ఇతర నగలు ఇంట్లో పెట్టకుండా జాగ్రత్తగా ఉండాలని రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు.

వాహనాల దొంగతనం.. ఇద్దరి అరెస్టు

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు 1వ టౌన్ ఎస్‌ఐ రఘుపతి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. బోధన్ మండలం రాకాసిపేటకు చెందిన అమీర్‌ఖాన్, కామారెడ్డి జిల్లా అడ్లూర్ గ్రామానికి చెందిన మహ్మద్ అనిఫ్ బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా దొంగతనానికి పాల్పడ్డ 5 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ వివరించారు.

నగరంలో భారీ అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సుభాష్‌నగర్,డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్ నగర్‌లోని భవాని పేపర్‌ప్లేట్‌ల దుకాణంలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణంలో ఉన్న పేపర్ ప్లేట్లు, ఇతర వస్తువులు అగ్నికి బూడిద అయ్యాయి. అగ్ని కీలలు అంటుకోగానే దుకాణ యజమాని, స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షాట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 4.5లక్షల వరకు నష్టం జరిగినట్లు దుకాణ యజమానులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్ల నీడే.. సమావేశ మందిరమాయే

- డొంకేశ్వర్ పీహెచ్‌సీలో గదుల కొరత
- రోగులు, సిబ్బంది అవస్థలు
- చెట్ల కింద సమావేశాలు



డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గదుల కొరత సమస్య గత కొన్ని సంవత్సరాలుగా వేధిస్తోంది. .వైద్యం బాగానే అందుతున్న సరిపడా గదులు లేక ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్బిణులు ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి, రోగులకు ప్రత్యేక గదులు లేకపోవడంతో పాటు సరైన వసతులు అందడం లేదు. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగులకు గదులు సరిపడా లేకపోవడంతో ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా ప్రతినెలా వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలు ఆస్పత్రి ఆవరణలో చెట్ల కిందనే నిర్వహించుకోనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనంగా గదులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మండల వైద్యాధికారి సుభాకర్‌ను వివరణ కోరగా.. ఆసుపత్రిలో గదుల కొరత ఉన్న వాస్తవమేనని పేర్కొన్నారు.

- డొంకేశ్వర్


ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న డీఏవో వీరాస్వామి

రైతులకు అందుబాటులో ఎరువులు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామి

నవీపేట,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు సంబంధించి జిల్లాలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జీ.వీరాస్వామి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఎరువుల దుకాణాలతో పాటు నాగేపూర్, బినోలలో సొసైటీల పరిధిలోని ఎరువుల గోదాములను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈపాస్ మిషన్‌లో ఎరువుల స్టాక్ వివరాలను తెలుసుకోవడంతో పాటు గోదాములలో సంబంధిత నిల్వలు, రికార్డులను పరిశీలించారు. యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు అవసరాలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు సమయంలో దుకాణదారుల వద్ద నుంచి రసీదును తప్పకుండా తీసుకోవాలని సూచించారు. డీఏవో వెంట ఏవో నవీన్ కుమార్ తదితరులున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుదర్శన్ ఇంట్లో దొంగతనం జరగడంతో, నష్టపోయిన ఆ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పోలీసులకు సూచించారు. చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మంగళవారం సుదర్శన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జరిగిన నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. అ సందర్భంగా అక్కడి నుంచే సీఐతో ఫోన్‌లో మాటాడారు. దొంగలను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈయన వెంట బీఆర్ఎస్ నేతలున్నారు.


బాధితులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

లైబ్రేరియన్‌పై సస్పెన్షన్ వేటు

- నందిపేట గ్రంథాలయంలోకి కప్పలు, పాములు
- గ్రంథాలయం నిర్వహణపై కలెక్టర్ సీరియస్
- పుస్తకాలు, స్టాకు, పాత పేపర్ల రూంలు సీజ్
- ఔట్ సోర్సింగ్ హెల్పర్‌కు బాధ్యతల అప్పగింత



విచారణ చేపడుతున్న ఏ గ్రేడ్ గ్రంథపాలకుడు రాజారెడ్డి

నందిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మల్ శాఖా గ్రంథాలయంలోకి కప్పలు, పాములు రావడంతో సిబ్బంది 3 రోజులుగా తాళం వేయడంతో పాఠకులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో 'గ్రంథాలయానికి గ్రహణం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణరెడ్డి విచారణ చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఏ గ్రేడ్ గ్రంథపాలకుడు రాజారెడ్డి విచారణ చేపట్టారు. సగం వరకు తలుపులకు మరమ్మతులు చేయించారు. పుస్తకాలు, మ్యాగజైన్లు, స్టాకు, పాత పేపర్లు ప్రధాన తలుపులకు తాళాలు వేయించి, సీజ్ చేశారు. నివేదికను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి పంపగా ఇన్‌చార్జి లైబ్రరియన్ టి.నరేష్‌రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెల్మల్ శాఖా గ్రంథాలయ విధులను నందిపేట శాఖా గ్రంథాలయం ఔట్ సోర్సింగ్ హెల్పర్ ఎం.నిర్మలకు అప్పజెప్పినట్లు జిల్లా కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్


సంత మల్లన్నను దర్శించుకుంటున్న రమేష్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ గ్రామ శివారులో గుట్టపై కొనసాగుతున్న సంత మల్లన్న జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి సంత మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంత మల్లన్నకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డిని సన్మానించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు


పోలింగ్‌కేంద్రాలను పరిశీలిస్తున్న డిచ్‌పల్లి సీఐ వినోద్

జక్రాన్‌పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిచ్‌పల్లి సీఐ కే.వినోద్ పేర్కొన్నారు. మండలంలోని పుప్పాలపల్లి, సికింద్రాపూర్, వివేక్‌నగర్ తాండ పోలింగ్ కేంద్రాలను మంగళవారం డిచ్‌పల్లి సీఐ కే. వినోద్ సందర్శించారు. మండలంలో ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. భద్రత ఏర్పాట్లు, బారికేడింగ్, లైటింగ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. పోలింగ్ రోజు ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వేచ్ఛాయుతంగా ఓటుహక్కు వినియోగించుకునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శాంతియుతంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధంగా ఎన్నికలను నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. సీఐ వెంట జక్రాన్‌పల్లి ఎస్సై జీ.మహేష్, పోలీసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముప్కాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ ఎస్సై శైలేందర్ సూచించారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళ సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ముందుకు వస్తున్నారని రాజకీయ పార్టీల పేరిట ఆఫర్ ఫేక్ లింకు పంపిస్తున్నారని తెలియజేశారు. అలాంటి లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీ నెంబర్లు చెప్పవద్దని సూచించారు. మీ కుటుంబ సభ్యులు డిజిటల్ అరెస్టులు అయ్యారని, విడిచి పెట్టడానికి బ్యాంక్ లావాదేవీలు జరపాలని డిమాండ్ చేస్తున్నారని వివరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వాసుదావు, భాస్కర్, రమేష్, ప్రశాంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


బాల్కొండలో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న మండల పోలీసులు

అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు

ముప్కాల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తే వారిపైన కేసు నమోదు చేస్తామని బాల్కొండ ఎస్సై శైలేందర్ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టే మెసేజ్‌లు వాట్సాప్ గ్రూప్, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లు పోలీస్ వారి పర్యవేక్షణలో ఉన్నట్లు గమనించాలని సూచించారు. ప్రజలు ప్రతీఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఉపాధ్యాయులను నియమించాలి

- ఎన్ఎస్‌యూఐ డిమాండ్

భీమ్‌గల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వెంటనే నియమించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెహమాన్ డిమాండ్ చే శారు. సంఘం నాయకులతో కలిసి ఎంఈవో స్వామికి మంగళవారం వినతిపత్రం అందజే శారు. పాఠశాలలో తెలుగు, ఉర్దూ మీడియం బోధించడానికి నలుగురు ఉపాధ్యాయులు లేరని దీంతో విద్యాసంవత్సరం పూర్తవుతున్న వేళ, పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈవోను కోరారు. అలాగే పాఠశాలలో వంట గది నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పలువురు నాయకులు ఉన్నారు.


మాట్లాడుతున్న భీమ్‌గల్ తహసీల్దార్ షబ్బీర్

దివ్యాంగుల దినోత్సవం

భీమ్‌గల్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనం గా నిర్వహించారు. తహసీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంఈవో స్వామి, ఎస్‌ఐ సందీప్ జ్యోతి ప్రజ్వలన చేసి దివ్యాంగులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దివ్యాంగులకు చేతి కర్రలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ల, పింఛన్లు అందరికీ వచ్చేలా కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం పావురాలను ఎగరవేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ప్రమీలా, సీసీలు కుంట శ్రీనివాస్, సుమలత, నరేష్, రఘుపతి, శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తుల కేటాయింపు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 న మూడవ విడతగా జరుగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ ఉపసంహరణ మంగళవారం ముగిసింది. దీంతో కమ్మర్‌పల్లి మండలంలో 14 పంచాయతీలకు ఒకటి(దొమ్మరిసొడు తండా సర్పంచ్, వార్డు సభ్యులందరూ ఏకగ్రీవం) కాగా మిగిలిన 13 గ్రామ పంచాయతీలకు 56 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. 13 పంచాయతీల్లో 138 వార్డులకు 36 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 102 వార్డులలో 276 మంది బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియగానే అధికారులు బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. దీంతో అభ్యర్థులు తమ గుర్తులతో ప్రచార సామగ్రి కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఏకమై.. ఏకగ్రీవం చేసి

- ముగిసిన మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ
- ఆర్మూర్ డివిజన్‌లో పలు గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవాలు
- వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కో నామినేషన్
- ఒకే తాటిపైకి గ్రామస్థులు


పీట్ల శ్రీనివాస్ (అంక్సాపూర్)


మైలారం సంతోష్(జాన్కంపేట్)


నూతుల విజయ(కొత్తపల్లి)


గడ్డం అనిల్, (దొన్కల్)


యాల్లా సాయరెడ్డి (మిర్దాపల్లి)


ఇట్టెడి లింగారెడ్డి , (దేగాం)


రాచర్ల సవిత (సిర్పూర్)

వేల్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ఉపసంహరణ మంగళవారం ముగిసింది. 4 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు. అంక్సాపూర్‌లో సర్పంచ్, 12 వార్డు సభ్యుల స్థానాలు, జాన్కంపేట్, కొత్తపల్లి(ఎన్), హనుమాన్‌నగర్ (పడిగెల ఒడ్డెర కాలనీ)లలో సర్పంచ్‌లు, 8 చొప్పున వార్డు సభ్యులు స్థానాలు ఏకగ్రీవమైనట్లు వెల్లడించారు. అంక్సాపూర్ సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్‌గా రిజర్వ్ కావడంతో పీట్ల శ్రీనివాస్, కొత్తపల్లి జనరల్ మహిళకు రిజర్వు కాగా నూతుల విజయ, జాన్కంపేట్‌లో జనరల్ రిజర్వ్ కాగా మైలారం(కొలిప్యాక్) సంతోష్, హనుమాన్ నగర్ జనరల్ రిజర్వు కాగా అల్లెపు నడిపి మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలం లో మిగితా 14 గ్రామ పంచాయితీల్లో ఇద్దరి నుంచి ముగ్గురు చొప్పున సర్పంచ్ పదవి బరిలో ఉన్నారు.

ఆలూర్‌లో 3 సర్పంచ్ స్థానాలు..

ఆలూర్: మండలంలో మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మూడు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమైట్లు అధికారులు ప్రకటించారు. మిర్దాపల్లిలో యాల్లా సాయరెడ్డి సర్పంచ్ స్థానం, పూర్తిగా వార్డు స్థానాలు, రామస్వామికి క్యాంప్‌లో సర్పంచ్‌గా పసుల పుష్ప, వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని, దేగాం గ్రామంలో ఇట్టెడి లింగారెడ్డి సర్పంచ్‌గా ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు.

సిర్పూర్ సర్పంచ్‌గా సవిత..

డొంకేశ్వర్: మూడో విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం తో ముగిసింది. 13 పంచాయతీలకు సి ర్పూర్ ఏకగ్రీవం.. కాగా 12 సర్పంచి స్థానాలకు 44 మంది పోటీలో ఉన్నారు. 118 వార్డులకు 48 ఏకగ్రీవమ య్యాయి. 70 వార్డులకు 204మంది పోటీలో ఉన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సిర్పూర్ గ్రామస్థులంతా కలిసి సర్పంచ్, వార్డు స్థానాలకు ఒకరితోనే నామినేషన్ వేయించారు. అందరూ కలిసి ఏకతాటిపై నిలిచి మండ లంలోని సిర్పూర్ గ్రామ సర్పంచ్ స్థానంతో పా టు 8 వార్డులు స్థానాల్లో ఒక్కో నామినేషన్ వేశారు. అయితే ఇక్కడ 964 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు కేటా యించగా.. రాచర్ల సవిత నామినేషన్ వేశారు. ఎనిమిది వార్డు స్థానాలకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు రావడం అధికారుల పరిశీలనలో చెల్లుబాటు కావడంతో సిర్పూర్ సర్పంచుగా రాచర్ల సవిత, 8 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

సుర్బిర్యాల్ సర్పంచ్‌గా శ్రీనివాస్..

ఆర్మూర్: మండలంలోని సుర్బిర్యాల్ సర్పంచ్‌గా ఎర్రం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోటీలో ఉన్న ప్రత్యర్థులు మంగళవారం నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నికను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

దొన్కల్ సర్పంచ్ పదవి ఏకగ్రీవం

మోర్తాడ్: మండలంలోని దొన్కల్ సర్పంచ్‌గా గడ్డం అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పోటీలో ఉన్న అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో గడ్డం అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతేకాక వార్డు సభ్యులు కూడా ఏకగీవ్రంగా ఎన్నికయ్యారు. మండలంలోని మిగతా పంచాయతీల్లో ముగ్గురు, నలుగురి అభ్యర్థులు బరిలో ఉన్నారు. దీంతో పోరు రసవత్తరంగా మారనుంది. నేడు గుర్తులను సైతం కేటాయించడంతో అభ్యర్థులు ప్రచార సామగ్రి కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

చేతులు కలిపితే ఉద్యోగం పోయినట్టే ..!

కామారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు జరిగే సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుంది. దీని ఉద్దేశం ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పని చేస్తున్నట్లు లెక్క. అయితే కొందరు ఉద్యోగులు తెలియని తనం, అత్యుత్సాహంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండటం చేస్తుంటారు. ఇలా చేయడం తప్పని ఎన్నికల సంఘం చెబుతోంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉద్యోగం ఊడిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తోంది.

కరచాలనం ఎందుకు చేయకూడదు ..?

ఉద్యోగులు ఒక అభ్యర్థికి బహిరంగంగా కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండడం ద్వారా ఆ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నారనే లేదా అనుకూలంగా ఉన్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. దీంతో ఎన్నికల ప్రక్రియ పై విశ్వసనీయత సన్నగిల్లే అవకాశం ఉంది.

పరిధి దాటితే శిక్ష తప్పదు

ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే శిక్షలు తప్పవు. క్రమ శిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి సర్వీస్ రూల్స్ ప్రకారం శాఖపరమైన విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది. వేతన పెరుగుదల, పదోన్నతి నిలిపివేయడం, కొన్ని సందర్భాల్లో ఉద్యోగం నుంచి తొలగించడం, నిర్బంధ పదవీ విరమణ చేయిస్తారు. ఉద్దేశపూర్వకంగా ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే కేసులు నమోదుచేసి జైలుకు పంపే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో జరిమానాలు విధిస్తారు.

ఎన్నికల పండక్కి.. కాసుల పంట



ఏర్గట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పోరుతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. బరిలో నిలిచే అభ్యర్థులు హామీల వర్షంతో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇప్పటికే మొదటి విడత ఎన్నికల్లో పాల్గొనే నేతలు ప్రచారం పూర్తిచేసుకోగా.. మిగతా రెండు విడతలకు సంబంధించిన నేతలు ప్రచారం కొనసాగిస్తున్నారు. అయితే ఎన్నికల పుణ్యమా అని గత రెండేళ్ల తరువాత వచ్చిన ఎన్నికలతో గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచాయి. దీంతో పంచాయతీలకు కాసుల పంట కురుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థితో పాటు వారిని బలపరచిన వారి నో డ్యూస్ సర్టిఫికెట్ ఉండాలని నిబంధన ఉండటంతో తప్పని సరి చెల్లించే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అభ్యర్థులు తమ ఇంటి పన్నులు పెండింగ్‌లో ఉంచుకోవద్దనే ఉద్దేశంతో ఇంటి పన్నులు చెల్లిం చారు. ఈ మండలంలోని 8 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు 49 మంది, వార్డు సభ్యులకు గాను 174 మంది నామినేష్ దాఖలు చేశారు. దీంతో 10 శాతం మేర మండల వ్యాప్తంగా 5 లక్షల పన్నులు వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఇంత కాలంగా ఉన్న మొండి బకాయిల సమస్య కొంతమేర తప్పిందంటున్నారు.

పల్లెపోరులో గమ్మత్తైన గుర్తులు

మద్నూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో పాటు మంగళవారం అభ్యర్థులకు గుర్తులు కేటాయించటంతో ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు దూసుకెళ్తున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రయ్యే వరకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రతిఒక్కరినీ కలుస్తూ ఓట్లు రాబట్టేందుకు కృషి చేస్తున్నారు. అయితే సర్పంచ్ అభ్యర్థులకు 32 గుర్తులను వార్డులకు 20 గుర్తులను ఎన్నికల కమిషన్ కేటాయించింది. సర్పంచులకు, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికల గుర్తులు కేటాయించారు. ఎన్నికల కమిషనర్ కేటాయించిన కొన్ని గుర్తులపై అభ్యర్థుల పెదవి విరుపు కనిపిస్తుంది. సర్పంచ్, వార్డులకు కేటాయించిన ఎన్నికల గుర్తులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవి ఏం గుర్తుందని పెదవి విరుస్తున్నారు. అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు అక్షర క్రమంలో గుర్తులు కేటాయించారు. తమకు వచ్చిన గుర్తును గ్రామీణ ఓటర్లు దాన్ని సరిగా గుర్తిస్తారో లేదో అని మదన పడుతున్నారు. మంచం, టేబుల్, బ్లాక్ బోర్డు, పలక, బిస్కెట్ లాంటి వాటిల్లో కొన్నింటి పోలిక దగ్గరగా ఉందంటున్నారు. స్టంప్స్ హాకీ స్టిక్, నిరక్షరాస్యులకు ఏం తెలుసు అని ప్రశ్నిస్తున్నారు. గుర్తులు సరిగ్గా గుర్తుంచుకునేలా చాలా మంది అభ్యర్థులు ఆ గుర్తుతో కూడిన నమూనా తయారుచేయించి ప్రచారం చేస్తుండగా మరికొందరు గుర్తుల నమూనాలను ఇంటింటికీ పంచుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.



బీర్కూర్‌లో కంటి వైద్యశిబిరం



బీర్కూర్‌లో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బీర్కూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 35 మందికి కంటి పరీక్షలు చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ఇందులో ఏడుగురికి మోతిబిందు ఉన్నట్లు నిర్ధారించారు. శస్త్ర చికిత్స నిమిత్తం వారిని బోధన్ లయన్స్ క్లబ్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు రమేష్, జోన్ చైర్మన్ కొట్టూరి సంతోష్, లయన్స్ సభ్యులు బస్వాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ



తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ దీక్ష చేపట్టారని, ఆ దీక్షతో పాటు అన్ని వర్గాల ప్రజల నుంచి వచ్చిన సహకారంతోనే నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన దీక్షా విజయ్‌దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌తోనే చాలా మంది ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎదిగారని, కానీ నేడు కేసీఆర్‌ను మోసం చేశారని మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపించి సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

ఇందూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 17వ రోజు జరిగిన డిగ్రీ సీఈబీసీఎల్, 1వ, 3వ, 5వ సెమిస్టర్, 2వ, 4వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు జరిగాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 30 సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించారు. మంగళవారం జరిగిన పరీక్షకు 386 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 374 మంది విద్యార్థులు హాజరయ్యారని, 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.

రాత్రయితే.. సుక్క.. ముక్క



- గ్రామాల్లో జోరందుకున్న అభ్యర్థుల పంపకాలు
- ఓట్ల కోసం రూ.లక్షల్లో ఖర్చు
- పట్టణాల్లో ఉన్న వారికి రవాణా ఏర్పాట్లు
- చివరిరోజు ర్యాలీలు, విస్తృత ప్రచారం

భిక్కనూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత ఎన్నికలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. గురువారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం సాయంత్రానికి అభ్యర్థుల ప్రచారాని కి ముగింపు పలకగా సర్పంచ్, వార్డుస్థానాల అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. ఈ మేరకు మంగళవారం నుంచి అభ్యర్థులు గ్రామాల్లో ఇంటింటికీ మద్యం, చికెన్ పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు మంగళవారం సాయంత్రం నుండి మూసివేయగా సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులు మద్యాన్ని ముందస్తుగా కొనుగోలు చేసి తమకు అనుకూలమైన స్థలంలో డంప్ చేసుకున్నారు. తెలిసిన చికెన్ దుకాణాల యాజమానులతో ఒక ధర నిర్ణయించుకుని ప్యాకెట్లలో అరకిలో, కిలో చొప్పున ప్యాక్ చేయించుకుని గ్రామంలోని ప్రతి గడపగడపకు వెళ్లి ఈ సారి ఒక్క చాన్సు ఇవ్వాలని, తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించడంతో పాటుగా ఒక చెకెన్ ప్యాకెట్, మద్యం బాటిల్‌ను, కూల్‌డ్రింక్స్‌ను అందజేసి ఓటర్లను తమవైపుకు తిప్పుకుంటున్నారు.

జోరందుకున్న అభ్యర్థుల పంపకాలు..

మొదటి విడత ఎన్నికల పోలింగ్ గురువారం మధ్యాహ్నం జరగనున్న నేపథ్యంలో మంగళవారానికి నిబంధ నల ప్రకారం అభ్యర్థుల ప్రచారం ముగిసింది. ఇక పోలింగ్‌కు బుధవారం ఒకరోజు మిగిలి ఉంది. ఇప్పటికే చాలా గ్రామాల్లో మంగళవారం నుంచే ఇంటింటికీ మద్యం బాటిల్, కూల్‌డ్రింక్, చికెన్ పొట్లాన్ని పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. యూత్‌లకు దావత్‌లు ఇస్తున్నారు. విజయం ఎవరికి దక్కుతుందో కానీ ఓటర్లను తృప్తి పర్చడంలో అభ్యర్థులు తగ్గట్లేదు.

లక్షల్లో ఖర్చు..

ఓట్లు ఎటు పడుతాయో, ఎవరు గెలుస్తారో పక్కన పెడితే మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో మంగళవారం నుండే పండుగ వాతవరణం నెలకొంది. ఎక్కడా చూసిన విందులు, దావత్‌లు కనిపిస్తున్నాయి. రాత్రి అయ్యిందంటే చాలు దావత్‌ల హడావిడి నడుస్తోంది. అభ్యర్థులు తమ గెలుపు కోసం రూ.లక్షల్లో ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడటం లేదు. ఖర్చు ఎంతైనా సరే గెలుపు ముఖ్యం అన్నట్లుగా సాగుతోంది.

రవాణా ఏర్పాట్లు..

అభ్యర్థులు గ్రామంలో విస్తృత ప్రచారంతో పాటుగా గ్రామాల నుంచి పట్టణాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పట్టణాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాల నిమిత్తం, వ్యాపారాల నిమిత్తం ఉండే వారికి అభ్యర్థులు ఫోన్ చేస్తూ ఓట్లు వేయాలని అభ్యర్థించడంతో పాటుగా గ్రామానికి రావ డానికి రవాణా ఏర్పాటుచేస్తున్నారు. వాహనాలను ఏర్పాటుచేయమంటే ఏర్పాటు చేయడం, లేదంటే రవాణా ఖర్చుల నిమిత్తం డబ్బులను ఆన్‌లైన్ ద్వారా పంపించ డం చేస్తున్నారు. ప్రతిగ్రామంలో సర్పంచ్, వార్డుస్థానా లకు పోటీ ఎక్కువగా ఉండటంతో గ్రామం వెలుపల ఉండే ఓటర్లే వారి విజయానికి కీలకం కానున్నారు. దీంతో పట్టణాల్లో, ఇతర ప్రదేశాల్లో ఉండే వారికి ఖర్చు ఎంతపెట్టడానికైనా వెనకాడట్లేదు.

ర్యాలీలు, విస్తృత ప్రచారం..

చివరి రోజు మంగళవారం అభ్యర్థులు గ్రామాల్లో మంది మార్బలంతో ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లో ఒక్కొక్కరికి రూ.200, రూ.300లు చెల్లించి దాదాపు 100 మందితో అభ్యర్థులు ర్యాలీలతో పాటుగా ఇంటింటికీ పలుమార్లు వెళ్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. అభ్యర్థుల ప్రచారం, ప్రచార రథాల పాటలతో సందడి నెలకొంది.

రోగులకు పండ్ల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి తెలంగాణ తలరాతను మార్చిన రోజును విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాలీక్‌బాబ, అజీమ్, లతీఫ్, అహ్మద్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పైప్‌లైన్ లీకేజీ.. తాగునీరు వృథా

- నీరు కలుషితమవుతుందని ఆవేదన
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు



తాగునీటి పైప్‌లైన్ లీకేజ్ అయిన దృశ్యం

జక్రాన్‌పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో కొన్ని రోజుల నుంచి తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. లీకేజీ అయిన తాగునీరంతా వృథాగా పోతుందని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. పైప్‌లైన్ లీకేజీ కాగా తాగునీరు కలుషితమవుతుందని, ఈ నీరు తాగడం వల్ల రోగాలబారిన పడే ఆస్కారం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు స్పందించి లీకేజీపడిన తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నాణ్యమైన తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువగళం

అభివృద్ధి చేసే వారికే ఓటేస్తా



మొదటి సారి ఓటు హక్కు రావడం ఆనందంగా ఉంది. తప్పకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటా. గ్రామాన్ని అభివృద్ధి చేసేవారికే ఓటు వేస్తాను. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని, ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి చేసేవారిని ఎన్నుకోవాలి.

- కంజర్ సాయి రాఘవి, ఎడపల్లి

ప్రలోభాలకు లొంగిపోవద్దు



నాకు ఇటీవలే ఓటర్ కార్డు వచ్చింది. గ్రామాన్ని అభివృద్ధి చేసేవారికే ఓటు వేస్తాను. మంచి నాయకుడిని ఎన్నుకున్నప్పుడే గ్రామంలో నెలకొన్న సమస్యలతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుంది. ఎన్నికల్లో గెలిచేందుకు చాలామంది మందు, విందులతో ప్రలోభాలకు గురిచేస్తారు. ఎవరు కూడా వాటికి లొంగిపోవద్దు. మంచి నాయకుడికే ఓటు వేయాలి.

- కేతావత్ శ్రీనివాస్, రామారెడ్డి

విద్యార్హత నిర్ణయించాలి



ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు కనీస విద్యార్హతను నిర్ణయించాలి. అప్పుడే పాలకులుగా విద్యావంతులు వస్తారు. వారికి ప్రజల సమస్యల పట్ల అవగాహన ఉంటుంది. ప్రజా అవసరాలు తీర్చే నేతలను ఎన్నుకోవాలి. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. తొలి ఓటు వేస్తున్న అన్న సంతోషంగా ఉంది. అభివృద్ధి చేసే నాయకుడికే నేను ఓటువేస్తాను. చాలామంది అభ్యర్థులు ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రలోభాలకు గురిచేస్తుంటారు. ఎవరు కూడా ప్రలోభాలకు లొంగి ఓట్లను దుర్వినియోగం చేయొద్దు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి.

- ఆడవ్ అన్వేష్

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడు కలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగుల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు తిరుమలేషం, శ్రావణ్, అకాష్, నితిన్, సన్ని పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కమ్మర్‌పల్లి: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగ జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకట రవి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కోరికను నెరవేరుస్తూ తెలంగాణ ఇచ్చిన తల్లిగా తెలంగాణ ప్రజల గుండెల్లో సోనియాగాంధీ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాయకులు బుచ్చిమల్లయ్య, నిమ్మ ప్రసాద్, దూలూర్ కిషన్ గౌడ్, సల్లూరి గణేష్ గౌడ్, సుంకెట శ్రీనివాస్, జగదీశ్ పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోర్తాడ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామం లో లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల వెలుగులతో అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, నిత్యహోమం, బలిహరణము జరిగాయి. గురువారం పద్మావతి, అలివేలిమంగ, వెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవం, జాతర జరుతాయని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాస్థాయి లో వాలీబాల్, కబడ్డీ పోటీలు, బుధ, గురువారాలలో జరుగుతాయని పీఈటీ ఆనంద్ తెలిపారు. జాతర సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రామకమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు మండలంలోని గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని ప్రధాన అర్చకులు శ్రీమన్‌చక్రపాణి మాదవచార్యులు కోరారు.

20 పంచాయతీలు.. 108 మంది బరిలో..

మద్నూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో 108 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. మద్నూర్ మండలంలో 21 గ్రామ పంచాయితీలలో ఒక గ్రామ పంచాయితీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో 20 గ్రామ పంచాయితీలకు ఈనెల 17న ఎన్నికలు జరగనున్నాయి. 69 మంది పోటీలో ఉన్నారు. అదే విధంగా 195 వార్డులు 50 వార్డులు ఏకగ్రీవం కాగా 139 వార్డులకు 403 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. డోంగ్లి మండలంలో 13 పంచాయితీలకు గాను ఒక గ్రామ పంచాయితీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో 12 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ గ్రామ పంచాయితీలలో 39 మంది అభ్యర్థులు పోటీలు ఉన్నారు. అదే విధంగా 253 వార్డు సభయలకు గాను 249 మంది బరిలో ఉన్నారు. కాగా ఎవరికి వారు గెలుపు కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. కుల సంఘాల సభ్యులను కలుస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల పోటాపోటీ ఉండగా మరికొన్ని చోట్ల గెలుపు సునాయాసంగా సాధించేలా పరిస్థితులు ఉన్నాయి. మరి చివరికి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి మరి.

హ్యాట్రిక్ విజయాన్ని అందించండి

- సేవ చేసే భాగ్యం కల్పించండి
- గౌరారం సర్పంచ్ అభ్యర్థి గజ్జెల హేమలత గోపి


గజ్జెల హేమలత గోపి

ధర్పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని గౌరారం గ్రామస్థులను సర్పంచ్ అభ్యర్థి గజ్జెల హేమలత గోపి కోరారు. బ్యాట్ గుర్తుకు ఓటు వేసి మూడో సారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు, మహిళా భవనం, గ్రామ పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్, సొంత నిధులతో దేవాలయ నిర్మాణాలు, శ్మశాన వాటిక, సీసీ రోడ్లు, డ్రైనేజీ, చెరువుల మరమ్మతులు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు అందించామని ఆమె పేర్కొన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆశీస్సులతో గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా నిలబెడుతానన్నారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పదేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తానని చెప్పారు. అవినీతి రహిత పాలనే తన లక్ష్యం అని పేర్కొన్నారు. సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని కోరారు. ప్రలోభాలకు లొంగవద్దని తాను ప్రజల కోసం పాటుపడే వ్యక్తినని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల దీవెనలు తనపై ఉన్నాయని గజ్జెల హేమలత గోపి ఈ సందర్భంగా అన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీ

- ఎమ్మెల్యే భూపతిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ, బీఆర్ఎస్ ఒక్కటై గ్రామాల్లో పోటీ చేస్తున్నాయని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కులాస్‌పూర్, సిర్పూర్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిర్పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆ పార్టీల నాయకుల మాటలు నమ్మి గ్రామీణ ప్రజలు ఎవరూ మోసపోవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, మహిళలకు వడ్డీలేని రుణాలు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ఇలాంటివెన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్నారని అన్నారు. మహిళలు ఉచిత ప్రయాణం చేస్తే వారి డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుందని తెలిపారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రానికి చేసిది ఏమీ లేదన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరికి రేషన్ కార్డులు కానీ, ఇళ్ల పంపిణీ చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో జరగడం లేదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్‌లనే ఈ ఎన్నికల్లో గెలిపిస్తే వారు గ్రామాలకు మరింత అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, వీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, గోర్కంటి లింగన్న, తూంపల్లి మహేందర్, కులాస్‌పూర్ సర్పంచ్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, బిలావత్ హాస్సేన్, సాయన్న, గంగారెడ్డి, రమేష్, సుభాష్, మహేందర్, శేఖర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, మోపాల్ సొసైటీ మాజీ చైర్మన్ కేతడి నారాయణ, సిర్పూర్ సర్పంచ్ అభ్యర్థి రేణుక రవీందర్, తిరుపతి, గ్రామ యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మరోసారి సేవచేసే భాగ్యం కల్పించండి

- ఎమ్మెల్యే సహకారంతో రేకులపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా


గల్లడి రాజేందర్, సర్పంచ్ అభ్యర్థి

ధర్పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మరోసారి సేవ చేసే భాగ్యం కల్పించాలని మండలంలోని రేకులపల్లి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గల్లడి రాజేందర్ అన్నారు. ఇప్పటికే తాను పదవిలో ఉన్న ఐదు సంవత్సరాలు ఎంతో అభివృద్ధి చేశానని మరింత అభివృద్ధి చేసేందుకు గ్రామస్థులు ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆశీస్సులతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం పక్షపాతం లేకుండా పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని యువత, మహిళల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని గతంలో కంటే మరింత అభివృద్ధి కోసం పేదల పక్షాన నిలబడి పోరాడుతానన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా హామీలను నెరవేర్చి రేకులపల్లి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా ఎమ్మెల్యే సహకారంతో చేస్తానన్నారు. ప్రజలు తనకు మరోసారి అవకాశం కల్పించి సేవ చేసే భాగ్యాన్ని ఇవ్వాలని ఆయన గ్రామస్తులను కోరారు. గ్రామంలో పారిశుద్ధం పనులు, డ్రైనేజీ, కల్వర్టులు, సీసీరోడ్లు, హెల్త్ సెంటర్‌లు నిర్మించానని ఈసందర్భంగా రాజేందర్ గుర్తు చేశారు. మరింత అభివృద్ధి కోసం అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

రాగిజావ నిధులు హాంఫట్...

(5వ పేజీ తరువాయి)

ఈ కార్యక్రమం అమలుకాకున్న బిల్లులు మాత్రం విద్యాశాఖ అధికారులు మంజూరు చేస్తున్నారు. గత విద్యాసంవత్సరం పూర్తిస్థాయి బిల్లులు మంజూరు కాగా అక్టోబరు నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం..

పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా రాగిజావ అందిస్తుండగా వారికి ఎలాంటి కమీషన్ ఇవ్వకపోవడంతో వారు అంతంతమాత్రంగానే అమలు చేస్తున్నారు. కొన్నిచోట్ల మాత్రం అసలు మెటీరియలే పాఠశాలలకు రావడం లేదని అందువల్లే తాము విద్యార్థులకు అందించడంలేదని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కో విద్యార్థికి 10గ్రాముల రాగిపిండి, 10గ్రాముల బెల్లం పిండి కలిపి ద్రవణంగా మార్చి అందజేయాల్సి ఉంటుంది. బెంగళూరుకు చెందిన శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ విద్యార్థుల సంఖ్యను బట్టి మండల విద్యాశాఖ కార్యాలయాలకు మెటీరియల్‌ను సరఫరా చేస్తోంది. అక్కడ నుంచి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెటీరియల్‌ను పాఠశాలలకు తీసుకెళ్లి మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమం విషయంలో ఎక్కడా కూడా ఆశించినస్థాయిలో చొరవచూపడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి పాఠశాలలకు మెటీరియల్ తీసుకెళ్లడంలో ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ప్రతి నెలా రూ.57లక్షలపైనే బిల్లులు

ఇదివరకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డును పంపిణీ చేయకున్నా ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు కుమ్మక్కై బిల్లులు తీసుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. తాజాగా రాగిజావ కార్యక్రమానికి సంబంధించి పూర్తిస్థాయిలో జిల్లాలో చాలాచోట్ల అమలుకాకున్నా సంబంధిత ట్రస్ట్‌కు మాత్రం ప్రతి నెలా రూ.57లక్షల పైన బిల్లులు జిల్లా విద్యాశాఖ నుంచి మంజూరవుతున్నాయి. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా బిల్లులు మంజూరు చేస్తున్నారు. తమకు పౌడర్ సరఫరా చేయడంలేదని మధ్యాహ్న భోజన నిర్వాహకులే బహిరంగంగా చెబుతున్నప్పటికీ ప్రతినెలా బిల్లులు మాత్రం మంజూరుకావడం అనేక అవినీతి ఆరోపణలకు తావిస్తోంది. గత రెండేళ్లకు సంబంధించి సుమారు రూ.10 కోట్లపైనే బిల్లులు మంజూరయ్యాయంటే ఎన్ని అక్రమాలు జరిగాయో అర్థమవుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారులే నేరుగా శ్రీసత్యసాయి ట్రస్ట్‌కు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తుండగా క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా పూర్తిస్థాయి బిల్లులు ఎలా మంజూరు అవుతున్నాయోనన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ వ్యవహారంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత సెక్షన్‌తో పాటు మండల విద్యాశాఖ కార్యాలయాలకు ట్రస్ట్ నుంచి భారీగానే ముడుపులు ముడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో విద్యాశాఖ అధికారులు మాత్రం జిల్లాలో పూర్తిస్థాయిలో రాగిజావకార్యక్రమం అమలవుతుందని చెప్పడం కొసమెరుపు.

పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాం..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత అక్టోబరు నుంచి రాగిజావ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాం. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు లేవు. ఎక్కడైనా అమలు చేయనట్లు మా దృష్టికి వస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. **- అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి**

పోలింగ్ విధులను పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ విధులను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రెండవ విడతగా గ్రామ పంచాయతీ ఎన్నికల విధులలో పాల్గొనే ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శనివారం నిజామాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ పోలింగ్ విధులను నిర్వహించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న తప్పిదానికి సైతం ఆస్కారం కల్పించకూడదన్నారు. సమయ పాలనను పాటిస్తూ, సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, పోలింగ్ మెటీరియల్‌ను తీసుకోవాలన్నారు. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రి ఉందా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అనంతరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను చక్కబెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. సీటింగ్ అరేంజ్ మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వంటి వాటిని నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. స్టేజ్-2 అధికారులు మినహా మిగతా మరెవరి వద్ద కూడా సెల్ ఫోన్లు ఉండకూడదని, పోలింగ్ కేంద్రం బయట సెల్ ఫోన్లను తీసుకుని భద్రపర్చేలా కౌంటర్ ఏర్పాటు చేయించాలన్నారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని పీ.ఓలకు సూచించారు. కాగా, పోలింగ్ శాతం, ఓట్ల లెక్కింపు వివరాల ప్రకటనలో తొందరపాటు ప్రదర్శించకూడదని, పక్కాగా నిర్ధారణ చేసుకున్న తరువాతనే ఓటింగ్ శాతాన్ని, కౌంటింగ్ వివరాలను వెల్లడించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లను ఎవరూ ప్రలోభాలకు గురి చేయకుండా చూడాలన్నారు. ఇదిలాఉండగా, డిచ్పల్లి మండల కేంద్రంలో పీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఎన్నికల సాధారణ పరిశీలకుడు జీ.వీ.శ్యాంప్రసాద్ లాల్ పాల్గొని సూచనలు చేశారు. శిక్షణ తరగతుల్లో స్థానిక అధికారులు, స్టేజ్ -2 రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

మొదటి విడత పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

పంచాయతీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, ఎన్నికల సాధారణ పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు. తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తా
- చింతకుంట సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల సింధు జగన్


సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల సింధు జగన్

మోస్రా, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి ఎలా ఉంటుందో గ్రామ ప్రజలకు చూపిస్తానని సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల సింధు జగన్ అన్నారు. గ్రామంలో ఎడ్ల సింధు జగన్ అనే అభ్యర్థి ఉంగరం గుర్తుతో దూసుకుపోతున్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని కుల సంఘాలతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎడ్ల సింధు జగన్ హామీ ఇచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ తీవ్ర ఇబ్బందిగా ఉందని ప్రజలను కలుపుకుని ఆ వ్యవస్థను రూపు మాపుతానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే ప్రతి క్షణం అభివృద్ధికి పరిష్కార మార్గాలు చూపుతానని స్పష్టం చేశారు. అభివృద్ధి కోసం పేదల పక్షాన నిలబతానని హామీ ఇచ్చారు. చిన్నా పెద్ద తేడా లేకుండా హామీలన్నీ నెరవేర్చి జిల్లాలో చింతకుంట గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని స్పష్టం చేశారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వచ్చిన తనను ప్రజలు పెద్ద మనసుతో ఆశీర్వదించాలని ఎడ్ల సింధు జగన్ విజ్ఞప్తి చేశారు. ఎవరి పెత్తనం లేకుండా ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడే నాలాంటి వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. మంచి ఆలోచనతో నాలాంటి వారికి అండగా నిలవాలని ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచ్‌గా గెలిపించాలని గ్రామ పెద్దలు, యువతీ యువకులను గ్రామంలో కుల సంఘాలను ఆయన కోరారు.

ఆర్చరీ నేషనల్స్ టెక్నికల్
అఫీషియల్‌గా మురళి


అభినందిస్తున్న డీవైఎస్‌వో

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన మద్దుల మురళిని నియమించారు. జిల్లాలో ఖేలో ఇండియా ఆర్చరీ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న మురళిని జాతీయస్థాయి టెక్నికల్ అఫీషియల్‌గా నియమించడంతో క్రీడల యువజన శాఖల అధికారి పవన్‌కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. నియామకం పట్ల ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఈత పోటీల్లో కాంస్య పతకం


పతకంతో అసోసియేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారుడు మోహనదుర్గ కాంస్య పతకం సాధించినట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మోహనదుర్గ 1500 మీటర్ల ఫ్రీ స్టైల్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడన్నారు. మెడల్ సాధించడం పట్ల స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, మహిపాల్‌రెడ్డి మోహనదుర్గను అభినందించారు.

ఆదిలాబాద్ ఇన్‌చార్జిగా విఘ్నేష్


విఘ్నేష్‌యాదవ్

నిజామాబాద్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేష్ యాదవ్‌ను ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి ప్రకటించారు. తనపై నమ్మకంతో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పిన శివచరణ్‌రెడ్డి, ఖలీద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే

- కేసీఆర్ దీక్షాదివస్ లేకపోతే తెలంగాణ ప్రకటన లేదు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు మొదటి నుంచి విలన్ కాంగ్రెసేనని, కేసీఆర్ దీక్షాదివస్ లేకపోతే తెలంగాణ ప్రకటన ఉండేది కాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కేసీఆర్ నవంబరు 29న నిర్వహించిన దీక్షాదివస్ వల్లే డిసెంబరు 9న తెలంగాణ ప్రకటన వచ్చిందన్నారు. ఈ ప్రకటన లేకుంటే రాష్ట్ర ఆవిర్భావమే లేదన్నారు. కేసీఆర్ పోరాటం వల్లనే తెలంగాణ సిద్ధించిందన్నారు. కాంగ్రెస్ దయా దాక్షిణ్యాలతో తెలంగాణ రాలేదని అన్నారు. కాంగ్రెస్ మోసం వల్లే యువకులు బలిదానాలు చేసుకున్నారన్నారు. మోదీ, చంద్రబాబు ఆదేశాలను రేవంత్ పాటిస్తున్నాడని ఆరోపించారు. జెండాలు వేరైనా ముగ్గురి ఎజెండా రాష్ట్ర నాశనమే అన్నారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట రేవంత్ రెడ్డి వందల కోట్లు ఖర్చుచేస్తున్నాడన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్, బీజేపీలు చేసింది శూన్యమని, అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రమ్మని సవాల్ విసిరారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. పులాంగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బెలూన్లను గాలిలోకి వదిలారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ మేయర్ నీతుకిరణ్, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్, సుమన రెడ్డి, విశాలిని రెడ్డి, నవీద్ ఇక్బాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో మూడేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన జైలుశిక్ష విధిస్తూ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి హరీష శుక్రవారం తీర్పు వెలువరించారు. ఏప్రిల్ 14 2023న ఓ మహిళ పై రెంజల్‌కు గైని కిరణ్ వేధింపులకు పాల్పడటంతో రెంజల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టులో పీపీ వసంత్ వాదించగా.. అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు అవ్వటంతో జడ్జి హరీష పైవిధంగా తీర్పు చెప్పారు. మహిళకు బాధితుల పరిహారం పథకం ప్రకారం.. రూ.50 వేలు అందజేయాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థకు సిఫార్సు చేశారు.

నేడు ఐటీసీ కంపెనీ ఉద్యోగ మేళా

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలలో ఐటీసీ కంపెనీ బుధవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ యాదగిరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐటీఐ, ఇంటర్మీడియట్ వొకేషనల్ పూర్తయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులకు నెలకు రూ.13వేల జీతంతోపాటు భోజనం ఉంటుందన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

14న ఇంటర్ విద్యార్థులకు..

ఇందూరు: ఇంటర్ విద్యార్థులకు హెసీఎల్ టెక్‌బీ ఉద్యోగ మేళా ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్ కంప్యూటర్ పాస్ అయిన విద్యార్థుల కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10గంటలకు శ్రీ వెంకటేశ్వర కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్, కోటగల్లి కమాన్ పక్కన, వర్ని రోడ్‌లో, నిజామాబాద్‌లో హాజరు కావాలని తెలిపారు. ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలలో చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇంటర్‌లో మొత్తం 75శాతం, 60శాతం మ్యాథమెటిక్స్‌లో మార్కులు పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు. మిగతా వివరాల కోసం 8074065830 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

21న పురస్కారాల ప్రదానం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి రాగమాలిక రసజ్ఞుల కళావేదిక అందించే జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు రాగమాలిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నీలిరాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రామ్మోహన్‌రావు, కేవీరావు, విజయరామరాజు, మురళీకృష్ణ, వెంకటహన్మిరెడ్డి, రాంచందర్, జయని నెహ్రూ, కవితారెడ్డిలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఈనెల 21న రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించే ఆపాట మధురగీతాల గానసభలో పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు

- డీఎల్‌పీవో శ్రీనివాస్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ధర్పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా తప్పనిసరిగా ఉండాలని లేనిపక్షంలో విద్యుత్ సరఫరా కోసం వెంటనే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ సమయంలో ఓటర్లకు ఇబ్బందులు కాకుండా జాబితాను సిద్ధంగా ఉంచాలని ఏ వార్డు ఏ గదిలో ఉంటుందోనని సామాన్యులకు అర్థమయ్యే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. డీఎల్‌పీవో వెంట ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎస్‌హెచ్‌వో కళ్యాణి, ఇతర అధికారులు ఉన్నారు.

ఎవరికి ఓటేయాలి

- రుద్రూరులో ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు
- ప్రచారంలో పార్టీ పెద్దలు చెరోవైపు

రుద్రూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మేజర్ గ్రామ పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. దీంతో కాంగ్రెస్ మద్దతుదారులు ఇద్దరు నామినేషన్ వేశారు. ఓ అభ్యర్థి తరఫున బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ప్రచారం చేశారు. మంగళవారం మరో అభ్యర్థికి మద్దతుగా ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ మద్దతుదారులు ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఒకే గ్రామంలో ఇద్దరు కాంగ్రెస్ మద్దతుదారుల ప్రచారంలో కీలక నేతలు ప్రచారం నిర్వహిస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. కాంగ్రెస్ పెద్దలు ఇద్దరికి ఓటు వేయాలని చెబుతుండటంతో కాంగ్రెస్ కార్యకర్తలు తికమకపడుతున్నారు.

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ 79వ పుట్టినరోజును కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, సీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సోనియా గాంధీ తన బర్త్‌డే గిఫ్టు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ యువకులు ఆత్మబలిదానాలు చూడలేక ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అంగీకరించారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు సోనియాగాంధీకి రుణపడి ఉంటారన్నారు. తనకు ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉన్నా తాను పక్కన ఉండి ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ను ప్రధానిని చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు భక్తవత్సలం, జావెద్ అక్రమ్, రత్నాకర్, రామర్తి గోపి, విపుల్ గౌడ్, వేణురాజ్, రాజానరేందర్ గౌడ్, సంతోష్, ఈసా, మఠం రేవతి, అబ్దుల్ ఎజాజ్, పోల ఉష, చంద్రకళ, లవంగ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్ సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

అగ్నివీరులు..!

(5వ పేజీ తరువాయి)

లేకుండానే యూట్యూబ్, ఆన్‌లైన్ ఛానల్‌ల ద్వారా సొంత మెటీరియల్ తయారు చేసుకొని సాధన చేసినట్లు సుమంత్ తెలిపాడు. డిఫెన్స్ రంగంలో ఉన్నత ఆఫీసర్‌గా విధులు నిర్వహించాలని ఉందని, దాని దాని కోసం ఇంకా తన ప్రయత్నాన్ని కొనసాగిస్తానని సుమంత్ తెలిపాడు. అలాగే మండల కేంద్రంలోని పాతూర్‌కు చెందిన బర్కి ధనుష్ మొదటి ప్రయత్నంలోనే అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మెన్(వై) విభాగంలో ఉద్యోగం సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బర్కి లింగం-లత కుమారుడే ధనుష్ మొదటి ప్రయత్నంలోనే ఆర్మీలో ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉందని ధనుష్ పేర్కొన్నాడు.

సినిమా గైడ్

దేవి : రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఆంధ్రకింగ్ తాలూకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ధురంధర్ (హింది) (11.15 9.15, 2.15, 6.15)
లలితమహల్ : అమరకావ్యం (11.15 9.15, 2.15, 6.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : రాజు వెడ్స్ రాంబాయి (11.00, 1.30, 7.40)
: దురంధర్ (హింది) (3.50, 10.10)
స్క్రీన్-2 : దురంధర్ (హింది) (10.20, 01.55, 7.00)
: రాజు వెడ్స్ రాంబాయి (10.35)
స్క్రీన్-3 : ఆంధ్రాకింగ్ తాలూకా (1.30, 7.20, 10.20)
: రాజు వెడ్స్ రాంబాయి (4.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-2 : జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (11.30)
: దురంధర్ (హింది) (2.00, 6.15, 10.30)
స్క్రీన్-3 : దురంధర్ (హింది) (10.00, 5.45)
: తేరే ఇష్క్‌మే (హింది) (2.15, 10.00)
స్క్రీన్-4 : రాజు వెడ్స్ రాంబాయి (10.10, 4.20)
: ఆంధ్రాకింగ్ తాలూకా (1.00, 7.10, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,28,500	రూ.1,18,400	రూ.1830

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290

